APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com

తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి    ఎడిటర్ : సి హరికృష్ణ    శనివారం 15 ఆగస్టు 2026    సంపుటి: 01    సంచిక :80    పేజీలు : 04    వెల: 2-00/-

# పాక్ అనుభవించాల్సిందే..

## సింధు జలాలకు బ్రేక్ పై తేల్చేసిన రాష్ట్రపతి..!



ఢిల్లీ, ఆగస్టు 15: తీవ్రవాదులు తమ చర్యలకు తగిన ఫలితాలు అనుభవించాల్సిందేనని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇవాళ మరోసారి తేల్చిచెప్పారు. పహల్గాం దాడుల తర్వాత సింధు జలాలకు బ్రేక్ వేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయాన్ని ఆమె సమర్ధించారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జాతినుద్దేశించి చేసే సంప్రదాయ ప్రసంగంలో ముర్ము పలు కీలక విషయాలు ప్రస్తావించారు. నక్సలిజం నిర్మూలన దిశగా భారత్ అడుగులు వేస్తోందని, అలాగే ప్రపంచమంతా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కుంటున్నా భారత్ మాత్రం నిలకడగా వృద్ధి చెందుతోందని ఆమె కితాబిచ్చారు. అలాగే డబ్బుల్లేక ఎవరూ న్యాయానికి దూరం కాకూడదని ఆమె ఆకాంక్షించారు. ఉగ్రవాదంపై భారత్ కఠిన వైఖరిని అవలంబిస్తున్నట్లు రాష్ట్రపతి గుర్తుచేశారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశంతో (పాకిస్తాన్ )సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం జాతీయ ప్రయోజనాల దృష్ట్యా, ముఖ్యంగా రైతుల ప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయాత్మక చర్యగా ముర్ము అభివర్ణించారు. ఉగ్రవాదులు, వారికి మద్దతు ఇచ్చేవారు ఎక్కడ దాక్కున్నా పరిణామాలను ఎదుర్కోవాల్సిందేనని రాష్ట్రపతి హెచ్చరించారు. ఉగ్రవాదంపై భారత్ రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఆపరేషన్ సిందూర్ భారత సాయుధ దళాల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిందని, ఉగ్రవాద నెట్‌వర్క్‌లపై కచ్చితమైన దాడులు నిర్వహించే సామర్థ్యం భారత సైన్యానికి ఉందని ఈ ఆపరేషన్ నిరూపించిందని ఆమె తెలిపారు. భారత్‌ను నక్సలిజం రహిత దేశంగా మార్చే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని రాష్ట్రపతి ప్రశంసించారు. ఒకప్పుడు వామపక్ష తీవ్రవాద ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొన్న బస్తర్ ప్రాంతంలో అభివృద్ధి వేగం పుంజుకోవడంతో పాటు సాంస్కృతిక కార్యకలాపాలు కూడా పెరుగుతున్నాయన్నారు. మరోవైపు ప్రపంచం యుద్ధాలు, అస్థిరత, అనిశ్చితితో సతమతం అవుతుంటే. భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం ప్రపంచ సగటు వృద్ధి రేటు కంటే రెండింతలకు పైగా వృద్ధి సాధిస్తోందన్నారు. గత దశాబ్దంలో 25 కోట్లకు పైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని గుర్తుచేశారు. అలాగే ఉచిత రేషన్ పథకం ద్వారా 80 కోట్లకు పైగా ప్రజలకు ఆహార భద్రత లభిస్తోందని పేర్కొన్నారు. మరోవైపు ఆర్థిక వనరులు లేకపోవడం వల్ల ఏ ఒక్కరూ న్యాయానికి దూరం కాకుండా చూడటం న్యాయవ్యవస్థతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.



# క్వార్టర్స్ రెడీ...

## అమరావతిలో కాపురమే తరువాయి

అమరావతి, ఆగస్టు 15: ఎమ్మెల్యే క్వార్టర్స్ అమరావతి రాజధానిలో సిద్ధం అయ్యాయి. అవి చూస్తే అద్భుతంగా ఉన్నాయి. మహా నగరాలలోని ఏ రాజ ప్రసాదాలకు తీసిపోని విధంగా వాటిని అత్యాధునికంగా నిర్మించారు. అంతే కాదు విశాలమైన ప్రాంగణాలు, క్రీండా వసతులు సహా అన్నీ సమకూర్చి పెట్టారు. ఇవన్నీ చూస్తే అమరావతి రాజధానిలో ఎమ్మెల్యే క్వార్టర్స్ భూతల స్వర్గాన్ని తలపిస్తున్నాయి. ఇప్పటిదాకా ఎమ్మెల్యేలు అంతా అమరావతికి రావాలంటే విజయవాడలో బస చేసి వస్తూండేవారు. లేదా తామున్న ప్రాంతం నుంచి వచ్చి వెళ్ళిపోతూండేవారు, ఇపుడు ఆ బాధ అయితే లేదని అంటున్నారు. ఇదిలా ఉంటే అమరావతి రాజధానిలో నిర్మాణం పూర్తైన ఎమ్మెల్యే ఎమ్మెల్సీల భవన సముదాయాన్ని చంద్రబాబు తాజాగా పరిశీలించి పూర్తి స్థాయిలో సంతృప్తి వ్యక్తం చేశారు. రాయపూడి వద్ద 12 టవర్లుగా ఎమ్మెల్యే ఎమ్మెల్సీల నివాస భవన సముదాయం నిర్మించబడింది. ఒక్కొక్కటీ 3500 చదరపు అడుగుల వైశాల్యంతో 288 ఫ్లాట్లను నిర్మించి సీఆర్డీఏ శభాష్ అనే తీరుని చాటుకుంది. అధునాతనంగా నిర్మించిన ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఫ్లాట్లను మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్లతో కలిసి పరిశీలించిన చంద్రబాబు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. రాజధానికి సరి కొత్త హంగులు ఏర్పడ్డాయని ఆయన వ్యాఖ్యానించారు. ఆయన ఎమ్మెల్యే క్వార్టర్స్ ని పరిశీలిస్తూ అక్కడ నిర్మాణాల తీరుని గమనించి హర్షం వ్యకం చేశారు. ఇదిలా ఉంటే ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు ఇక అమరావతిలో కాపురం ఉండేందుకు ఎలాంటి ఇబ్బంది లేదు, ఆకాశాన్ని అందుకునేలా అన్ని రకాల సదుపాయలతో నిర్మించిన ఈ క్వార్టర్స్ ని చూసిన వారు ఎవరూ విడిచి ఉండేది లేదు. మరో వైపు చూస్తె రాజధాని నగరంలో ప్రజా ప్రతినిధులకు క్వార్టర్స్ ఇవ్వడం సబబు. కానీ విభజన తరువాత ఏపీకి సరైన రాజధాని లేకపోవడంతో పుష్కర కాలంగా ప్రజా ప్రతినిధులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇపుడు వారి కష్టాలు తీరబోతున్నాయి అని అంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రజా ప్రతినిధులుగా ఉన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు గృహ ప్రవేశం చేస్తే కనుక అమరావతి రాజధాని ప్రజా రాజధానిగా మారడానికి తొలి అడుగు పడుతుంది. ఆ మీదట మిగిలిన భవనాలు కూడా సిద్ధం అయి మొత్తం అన్ని రకాలైన సిబ్బంది అడుగు పెడతారు. అలాగే మంత్రుల క్వార్టర్స్ కూడా రెడీ అవుతోంది. దాంతో రాజధానిలో అధికార అలికిడి సందడి నెలకొనే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అంటున్నారు. ఇదే సందర్భంలో సీడ్ యాక్సెస్ రహదారి ప్రారంభంతో రాజధాని అమరావతికి రాజమార్గం ఏర్పాటు అయ్యిందని చంద్రబాబు చెప్పారు. రాష్ట్రాభివృద్ధిలో అమరావతి నిర్మాణంలో ఇది మొదటి మెట్టు అని ఆయన స్పష్టం చేశారు. ఉండవల్లి వద్ద రాజధాని అమరావతిని(మిగతా 2వ పేజీలో)

# సీఎం రేవంత్ రెడ్డి కేసులో బిగ్ ట్విస్ట్




తెలంగాణ, ఆగస్టు 15: గత పదకొండేళ్లుగా ఉభయ తెలుగు రాష్ట్రాల రాజకీయాలను ఉత్కంఠకు గురిచేస్తున్న 'ఓటుకు నోటు కేసు మళ్లీ మొదటికి వచ్చింది. ఈ కేసును తొలి నుంచి విచారించాలని సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం గురువారం ఓటుకు నోటు కేసుపై విచారణ చేపట్టింది. ఈ సమయంలో నిందితుల తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది శేషాద్రి నాయుడు వాదనలు వినిపించారు. కేసుపై సుదీర్ఘంగా వాదనలు వినిపించాల్సివున్నందున వాయిదా వేయాలని కోరారు. ఇదే సమయంలో గత విచారణలో వాదనలు విన్న న్యాయమూర్తి ఉద్యోగ విరమణ చేయడంతో తాము కూడా తొలి నుంచి వాదనలు వినాల్సివుందని ధర్మాసనం అభిప్రాయపడింది. న్యాయవాదులు కూడా ఇందుకు సిద్ధమవడంతో కేసును మళ్లీ మొదటి నుంచి విచారిస్తామని సుప్రీంకోర్టు ప్రకటించింది. ఇక (మిగతా 2వ పేజీలో)

# గోదావరి పుష్కరాలకు వెయ్యి కోట్ల నిధులు..

తెలంగాణ, ఆగస్టు 15: 2027 గోదావరి పుష్కరాలను తెలంగాణా సర్కార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈసారి గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించాలని, అందుకు సంబంధించిన పనులు సెప్టెంబర్ మొదటివారంలో పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐటి మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. టెండర్ ప్రక్రియను ఆగస్టు చివరి నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాల సన్నద్దత, ఏర్పాట్లపైన అధికారులకు దిశా నిర్దేశం నేడు తెలంగాణ సచివాలయంలో నిర్వహించిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో గోదావరి పుష్కరాలకు సంబంధించి అనేక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రులు కొండ సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు శాఖల వారీగా గోదావరి పుష్కరాల సన్నద్దత, ఏర్పాట్లపైన అధికారులకు దిశా నిర్దేశం చేశారు. 26 జూన్ 2027 నుంచి 7 జూలై 2027 వరకు గోదావరి నది తీరం పుష్కర శోభతో విరాజిల్లేలా, భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు అన్ని మౌలిక సౌకర్యాలు కల్పిస్తూ గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించాలని గోదావరి పుష్కరాలపై ఏర్పాటు చేసిన కేబినేట్ సబ్ కమిటి సంకల్పించింది. పుష్కరాల సందర్భంగా గోదావరి తీరం వెంబడి ఘాట్ల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, రవాణా, భద్రత, వైద్య సదుపాయాలను పకడ్బందీగా (మిగతా 2వ పేజీలో)



# ఏపీలో ఉచిత బస్సుకు ఏడాది..!

అమరావతి, ఆగస్టు 15: ఏపీలో కూటమి సర్కార్ మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అమల్లోకి తెచ్చి శనివారంతో ఏడాది పూర్తవుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు ఉచిత బస్సుల్లో ప్రయాణిస్తున్నారని, స్త్రీ శక్తి పథకం ప్రారంభం నాటి నుంచి ఇప్పటి వరకు 87 కోట్ల ప్రయాణాలు చేశారని ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రకటించింది. గత ఏడాది కాలంలో స్త్రీ శక్తి పథకం కోసం రూ.3,095 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. 76 శాతం బస్సులకు ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. స్త్రీ శక్తి పథకం రాకముందు ఆర్టీసీ బస్సుల్లో మహిళల వాటా 40 శాతం ఉండగా.. ఇప్పుడు అది 62 శాతానికి పెరిగింది. రోజువారీ మహిళా ప్రయాణికుల సంఖ్య కూడా 9.47 లక్షల నుంచి 24 లక్షలకు చేరింది. ఈ పథకం అమలవుతున్న బస్సుల్లో ఆక్యుపెన్సీ 93 శాతానికి చేరింది.స్త్రీ శక్తి పథకం మహిళల ప్రయాణ ఖర్చును తగ్గించడం మాత్రమే కాకుండా.. విద్య, ఉపాధి, వైద్యం, వ్యాపారం, ఇతర అవసరాలకు పనికొస్తోంది. కాలేజీలకు వెళ్లే వారికి, చిరు వ్యాపారం నిమిత్తం ఒక ఊరి నుంచి మరొక ఊరు వెళ్లేవారికి, దైవ దర్శనాలకు వెళ్లేవారికి ఉపయోగపడుతోంది. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఇదే తరహా పథకాన్ని 4 కేటగిరి బస్సుల్లోనే అమలు చేస్తుండగా.. ఏపీలో మాత్రం ఐదు (మిగతా 2వ పేజీలో)

# రెచ్చగొట్టొద్దు.. గట్టి దెబ్బ కొడతాం..

## పాకిస్థాన్ పై అజిత్ దోవల్ ఫైర్



పాకిస్థాన్ పై నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ అజిత్ దోవల్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత సహనాన్ని బలహీనతగా భావించరాదని స్పష్టం చేశారు. ఎలాంటి పరిణామాలు ఎదురైనా భారత్ ఎప్పుడూ రిస్క్ లు తీసుకునేందుకు సిద్ధంగా ఉంటుందని.. బలంగా ప్రతిస్పందిస్తుందని అన్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై తొలిసారిగా స్పందించిన అజిత్ దోవల్ ఇందుకు సంబంధించిన డాక్యుమెంటరీలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఆపరేషన్ సింధూర్ ను ఎలా చేపట్టాలని ముందుగానే నిర్ణయించుకున్నామని పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లోని కీలక ఉగ్ర స్థావరాలపై, ఉగ్రవాద క్యాంపులపై దాడులు చేపట్టామని అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ ధీటుగా స్పందిస్తుందనే స్పష్టమైన సందేశాన్ని ప్రపంచ దేశాలకు ఆపరేషన్ సింధూర్ తో చూపామని అజిత్ దోవల్ స్పష్టం చేశారు. ఆయనతో పాటు పలువురు అధికారులు ఈ డాక్యుమెంటరీలో ఆనాటి తమ అనుభవాలను పంచుకున్నారు. ఇక ఈ కీలకమైన డాక్యుమెంటరీ ప్రతి శనివారం రాత్రి 9 గంటలకు డిస్కవరీ అలాగే డిస్కవరీ ప్లస్ ఓటీటీ ప్లాట్ ఫామ్ లో ప్రసారం కానుంది. ఇందులో దాదాపు 88 గంటల పాటు సాగిన సైనిక ఆపరేషన్ వెనక ఉన్న వ్యూహాలు, నిర్ణయ ప్రక్రియపై దోవల్ వివరించనున్నట్లు సమాచారం. ఇక జమ్మూ కాశ్మీర్ లోని అనంత్ నాగ్ జిల్లాలోని పహల్గామ్ లోయలో ఏప్రిల్ 22న ఉగ్రవాదులు జరిపిన మారణ హోమంలో 26 మంది టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ ఈ దాడుల వెనకున్నట్లు తేలిన నేపథ్యంలో పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లోని 9 కీలక ఉగ్ర స్థావరాలపై దాడులు చేసి వాటిని ధ్వంసం చేసింది. వందలాది మంది ఉగ్రవాదులను ఏరివేసింది. వాటిలో ముజఫరాబాద్ లోని సవాయ్ నాలా క్యాంప్ అలాగే సిడ్నా బిలాల్ క్యాంప్, కోట్లీలోని గుల్ పూర్ క్యాంప్, భీంబర్ లోని బర్నాలా క్యాంప్, అబ్బాస్ క్యాంప్, సియాల్ కోట్ లోని సర్జాల్ క్యాంప్, మెహమూనా జోయా క్యాంప్, మురిడ్ కే లోని మార్కాజ్ టైబా క్యాంప్, బహావల్ పూర్ లోని మార్కజ్ సుభానల్లా క్యాంప్ ఉన్నాయి. వీటిని భారత్ పూర్తిగా ధ్వంసం చేసినట్లు వెల్లడించింది.

# లోకేశ్ 'స్మార్ట్' ఐడియాకు నీతి అయోగ్ ప్రశంసలు!




కడప, ఆగస్టు 15: టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర విద్యా, మానవవనుల మంత్రి నారా లోకేశ్ ను కేంద్ర ప్రభుత్వ నీతి అయోగ్ అభినందించింది. లోకేశ్ స్మార్టు ఆలోచనతో కడప జిల్లాలో తీసుకువచ్చిన స్మార్ట్ కిచెన్ నమూనా బాగుందని కితాబునిచ్చింది. ప్రస్తుతం కడప జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న ఈ విధానాన్ని త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రి లోకేశ్ ఆలోచనను ప్రశంసిస్తూ కేంద్ర ప్రభుత్వ సంస్థ చేసిన ప్రకటన రాష్ట్ర ప్రభుత్వానికి మరింత ప్రోత్సాహమిచ్చిందని వ్యాఖ్యానిస్తున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో మధ్యాహ్న భోజన పథకంలో తీసుకువచ్చిన వినూత్న విధానానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడంపై ప్రభుత్వ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. పాఠశాల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత పెంచడం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలనే లక్ష్యంతో స్మార్టు కిచెన్ లను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్ నిర్ణయించారని చెబుతున్నారు. ముందుగా రాష్ట్రంలో ఒక జిల్లాలో అమలు చేసిన తర్వాత మంచిచెడ్డలను గుర్తించి తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి తీసుకురావాలని మంత్రి లోకేశ్ భావించారని చెబుతున్నారు. దీంతో కడప జిల్లాలో ప్రయోగాత్మకంగా స్మార్టు కిచెన్ ఏర్పాటు చేశారు. దేశంలోనే తొలిసారిగా పైలట్ ప్రాజెక్ట్‌గా రూపొందించిన మొదటి స్మార్ట్ కిచెన్‌ను గత ఏడాది జూలైలో ప్రారంభించారు. ఆ తర్వాత ఈ విధానాన్ని మరింత విస్తరిస్తూ జిల్లాలోని సీకే దిన్నె హైస్కూల్‌లో అధునాతన హంగులతో కూడిన ప్రధాన స్మార్ట్ కిచెన్‌ను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. దీనికి అనుబంధంగా మరికొన్ని కిచెన్‌లను ఏర్పాటు చేశారు. కడప, కమలాపురం, జమ్మలమడుగు నియోజకవర్గాల్లో తొలి విడతగా కొన్ని కేంద్రాలను ప్రారంభించి సుమారు 136 పాఠశాలల్లోని 10 వేలకు పైగా విద్యార్థులకు భోజనాన్ని అందించడం ప్రారంభించారు. ాశ్రీంశీ =ఘుం – జగన్ కి క్రేజ్ అంత ఎందుకు ? సాంకేతికత, సమర్థత కలయికతో కడపలో అమలు చేసిన ఈ స్మార్ట్ కిచెన్ విధానంలో ఆధునిక మౌలిక వసతులు, అధునాతన సాంకేతికతను అనుసంధానించారు. దీంతో విద్యార్థులకు న్యాయమైన భోజనంతోపాటు పౌష్టికాహారం లభిస్తుందని నీతి అయోగ్ గుర్తించింది. సాంకేతికతను జోడించి ప్రభుత్వ పాఠశాలల్లో పౌష్టికాహార పంపిణీని సమర్థవంతంగా నిర్వహిస్తున్న తీరును కొనియాడింది. మానవ ప్రమేయం పెద్దగా లేకుండానే పెద్ద ఎత్తున యంత్రాల ద్వారా అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారీ చేయడంపై సంతృప్తి వ్యక్తం చేసింది. కఠినమైన ఆహార భద్రతా ప్రమాణాలు పాటిస్తూ విద్యార్థుల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అభిప్రాయపడింది. ఇక ఈ విధానంలో భోజనం సరఫరాను రియల్ టైమ్ లో ట్రాక్ చేస్తారు. వండిన ఆహారాన్ని పాఠశాలలకు చేరవేసే వాహనాలకు జీపీఎస్ అమర్చి, ఆహార సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. భోజనం నాణ్యతపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల అభిప్రాయాల సేకరణకు క్యూఆర్ కోడ్ ఆధారిత ఫీడ్‌బ్యాక్ వ్యవస్థను తీసుకువచ్చారు. ఇదే సమయంలో స్మార్ట్ కిచెన్ల నిర్వహణలో మహిళా స్వయం సహాయక సంఘాలకు భాగస్వామ్యం కల్పించారు. కాగా, నీతి ఆయోగ్ నుంచి లభించిన ప్రశంసలపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ప్రతి బిడ్డకు నాణ్యమైన, పౌష్టిక ఆహారం అందించడం కనీస బాధ్యతగా పేర్కొన్నారు. కడపలో విజయవంతమైన ఈ 'స్మార్ట్ కిచెన్' మోడల్‌ను త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని వెల్లడించారు. విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జాతీయ స్థాయి గుర్తింపుతో విద్యాశాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందిలో మరింత ఉత్సాహం వచ్చిందని వ్యాఖ్యానించారు.




# డేటా సెంటర్లు తాగే నీరు ఎంత ?

విశాఖపట్నం, ఆగస్టు 15: ఏపీలో విశాఖపట్నంతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ డేటా సెంటర్ల ఏర్పాటుకు కూటమి సర్కార్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రావడంతో, మూడు చోట్ల స్థలం కేటాయించి నిర్మాణాలకు కూడా ప్రభుత్వం సహకరిస్తోంది. అయితే డేటా సెంటర్ల రాకతో రాష్ట్రంలో నీటి వినియోగం పెరిగిపోతుందని, జనం నీళ్ల లేక ఇబ్బందులు పడతారని, భూగర్భజలాలు కూడా అడుగంటి పోతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. వీటిపై సీఎం చంద్రబాబు స్పందించారు. రాష్ట్రంలో డేటా సెంటర్లకు నీటి అవసరాలపై కొందరు లేనిపోని విమర్శలు చేస్తున్నారని సీఎం చంద్రబాబు ఇవాళ నిర్వహించిన జల వనరులశాఖ సమీక్షలో ఆరోపించారు. మొత్తంగా వాటికి 3.5 టీఎంసీల నీరే సరిపోతుందని సీఎం తెలిపారు. ఈ అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అధికారుల్ని ఆదేశించారు. రాష్ట్రంలో లోటు వర్షపాతం పరిస్థితుల నేపథ్యంలో తాగు నీటికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఆ తదుపరి పారిశ్రామిక అవసరాలకు ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. ఇప్పటికే విశాఖలో ఏర్పాటు చేసిన డేటా సెంటర్ నీటి వినియోగంపై స్థానికంగా ఆందోళన పెరుగుతున్న వేళ చంద్రబాబు వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు రాష్ట్రంలో వాటర్ మూమెంట్ ప్లాన్ ప్రకారమే నీటి నిర్వహణ చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రస్తుతం లోటు వర్షపాతం పరిస్థితుల నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి నిల్వల్ని, భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ ఉండాలని సూచించారు. పోలవరం, వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతి, ప్రాధాన్యతా క్రమంలో చేపట్టనున్న 36 ప్రాజెక్టులు, రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు, నీటి విడుదల, తాగు నీటి సరఫరా నిర్వహణ ప్రణాళిక, జలధార– జలహారతి కార్యక్రమాల అమలుపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలవరం ప్రాజెక్టులో ఇప్పటి వరకూ 89.9 శాతం మేర సివిల్ పనులు పూర్తి అయ్యాయని అధికారులు వివరించారు.

# జగన్ కి క్రేజ్ అంత ఎందుకు ?



అమరావతి, ఆగస్టు 15: వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్ పొలిటికల్ గా సొంతంగా ఇమేజ్ ని సంపాదించుకున్నారు. తండ్రి వైఎస్సార్ చాటు బిడ్డగా 2009లో తొలిసారి కడప లోక్ సభ సీటు నుంచి ఎంపీగా పోటీ చేసే నాటికి జగన్ ఎవరో తెలియదు. మా వాడు రాజకీయాల్లోకి వస్తున్నాడు ఆశీర్వదించండి అంటూ ముఖ్యమంత్రి హోదాలో కడప ఎన్నికల ప్రచారంలో అప్పట్లో వైఎస్సార్ జగన్ గురించి మాట్లాడిన మాటలు వీడియోలు చూస్తే జగన్ రాజకీయంగా తండ్రి నీడలో ఎంతగా ఉన్నారో అర్థం అవుతుంది. అయితే అదే ఏడాది సెప్టెంబర్ లో తండ్రి ఆకస్మిక మృతితోనే జగన్ లోని నాయకుడు బయటకు వచ్చారు. సవాళ్ళను వరసగా ఎదుర్కొంటూ అదే క్రమంలో వైఎస్సార్ ఇమేజ్ ని తనకు బలంగా మార్చుకుని ఆ మీదట పాదయాత్రలతో జనాలకు చేరువ అయి తనకంటూ సొంతంగా పొలిటికల్ ఇమేజ్ ని జగన్ క్రియేట్ చేసుకున్నారు. ఇక జగన్ ఓటమికి ఆయనకు జనంలో వస్తున్న ఆదరణకు ఎక్కడా పొంతన లేదు. 2024 ఎన్నికల్లో కేవలం 11 సీట్లు మాత్రమే వైసీపీకి వచ్చాయి. ఇక ఈ పార్టీ పని అయిపోయింది అని అంతా అనుకున్నారు. అయితే 40 శాతం ఓటు బ్యాంక్ కూడా వైసీపీ వెన్నంటే ఉండడం జగన్ రాజకీయ గ్లామర్ పార్టీకి పెట్టని కోటగా మారాయి. ఇక బలమైన కూటమి ప్రభుత్వం ఏపీలో అధికారంలో ఉన్నా జగన్ ఎక్కడికి వెళ్ళిన జనాలు అయితే తండోపతండాలుగా రావడం ఆయన జనాదరణకు అద్దం పడుతోంది. ఇక ఏపీలో అధికారం ఎపుడూ జస్ట్ పది శాతం ఒటు షేర్ అటూ ఇటుగా మారుతుంది. 2014 నుంచి ఇదే తీరున ఉంది. ఓడిన పార్టీ టీడీపీ అయినా వైసీపీ అయినా 40 శాతం ఓటు షేర్ మాత్రం వారికి ఉంటోంది. ఇక అయిదేళ్ల కాలంలో ఆ పది శాతం ఓటు షేర్ ని తమ వైపునకు తిప్పుకుంటే పోయిన అధికారం తిరిగి దక్కుతోంది. 2019లో వైసీపీకి అదే జరిగింది. 2024లో టీడీపీ కూటమికి అదే అయింది. అందుకే 2029 ఎన్నికల మీద ధీమా వ్యక్తం చేస్తూ వైసీపీ జోరు చేస్తోంది. పది శాతం ఓటు షేర్ కోసమే జనం వద్దకు జగన్ వివిధ రూపాలలో పర్యటనలు చేస్తూ వస్తున్నారు. ఉన్న నలభైకి పదిని కలపడం అయితే అయిదేళ్ళ కాలంలో కష్టం కాదని ఏపీ గత రాజకీయ చరిత్ర నిరూపించింది. దాంతోనే వైసీపీ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. ఇక ఎన్నికలు గెలుపు ఓటములు పక్కన పెడితే జగన్ ప్రస్తుతం ఏపీలో ఎక్కడికి వెళ్ళినా జనాలు అయితే బ్రహ్మరథం పడుతున్నారు. ఒక్క సీటూ రాని ఉత్తరాంధ్రా గోదావరి జిల్లాలు కోస్తా జిల్లాలలో కూడా జగన్ కి ఈ మాదిరి ఆదరణ దక్కడం అయితే రాజకీయ విశ్లేషకులకు సైతం ఆశ్చర్యపరుస్తోంది. అలా అయినా జనాలు వస్తున్నారు అంటే జగన్ కి ఉన్న క్రేజ్ అది అని అంటున్నారు. కేవలం ఒక్క ప్రాంతం అని కాదు రాష్ట్రంలో ఏ రీజియన్ కి జగన్ వెళ్ళినా ఇదే మాదిరిగా జనాలు తరలి రావడం జరుగుతోంది అని గుర్తు చేస్తున్నారు. జగన్ ఉత్తరాంధ్రా టూర్ కి ఈ మధ్య వచ్చారు. విశాఖ ఎయిర్ పోర్టు నుంచి శ్రీకాకుళం దాకా ఏకంగా వంద కిలోమీటర్ల దూరం రోడ్డు మార్గంలో వెళ్ళారు. దానికి ఏకంగా ఆరేడు గంటలు పట్టింది. దారి పొడవునా జనాల జాతర కనిపించింది. అలాగే గోదావరి జిల్లాల పర్యటనకు జగన్ వెళ్ళినపుడు అది భీమవరం ఆక్వా రైతుల సమస్య అయినా తాజాగా తూర్పు గోదావరి జిల్లా పొగాకు రైతుల ఇష్యూ అయినా జగన్ కి జనాలు పెద్ద ఎత్తున స్వాగతం పలకడం కనిపిస్తోంది. ఇవన్నీ చూసినపుడు ఈ ప్రాంతాలలో ఒక్క సీటూ గెలుచుకోని వైసీపీకి ఇంతలా జనాలు తండోపతండాలుగా రావడం అంటే ఆలోచించాల్సిందే అని అంటున్నారు. జగన్ రాజకీయ జీవితం పదిహేడేళ్ళు కావచ్చు. కానీ ఆయన నిరంతరం జనంలో ఉంటూ మాస్ పల్స్ పట్టుకున్నారు అనిపిస్తుంది. అందుకే ఆయన జనం కోణం నుంచే మాట్లాడుతూంటారు. ఆ మధ్యన జగన్ మావిగన్ అంటే అంతా నవ్వుకున్నారు. ఏప్రిల్ ఫూల్ లాంటి జోక్ అన్నారు. అయితే ఇపుడు చంద్రబాబు కూడా గుంటూరు విజయవాడ అన్నీ కలుపుకునే రాజధాని అని చెప్పడం బట్టి చూస్తూంటే జగన్ ముందు చూపుతోనే ఈ తరహా వ్యాఖ్యలు చేశారని అంతే కాదు ఆయా ప్రాంతాల ప్రజల మనోభావాలను ఆయన బాగానే ఒడిసి పట్టుకున్నారని అంటున్నారు. అంతే కాదు మావిగన్ వర్సెస్ అమరావతి అంటూ జగన్ తన ఎన్నికల మేనిఫేస్టోలో పెడతాను అని చాలెంజ్ చేసిన తీరుతోనే ఏపీలో చాలా మంది ఆలోచనలు కూడా మారాయని అంటున్నారు.

# క్వార్టర్స్ రెడీ...

## అమరావతిలో కాపురమే తరువాయి

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడ మంగళగిరి గుంటూరులతో కలిపే కలిపే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ 3ని ఆయన ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రహదారిని అనుసంధానించేలా బకింగ్ హామ్ కాలువపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిలను కూడా బాబు ప్రారంభించారు. స్టీల్ బ్రిడ్జిలను ప్రారంభించటంతో రాజధాని నగరానికి మెరుగైన కనెక్టివిటీ వచ్చినట్టైంది. మూడో దశలో మణిపాల్ ఆస్పత్రి సమీపంలో జాతీయ రహదారి 16కు అనుసంధానించేలా ప్రణాళిక చేశారు. దీనికి రూ.1,519 కోట్ల వ్యయం కానుంది. ఇవన్నీ చూసిన తరువాత రాష్ట్రాభివృద్ధి విజన్‌కు అమరావతి నగర నిర్మాణం మొట్టమొదటి సక్సెస్ అని బాబు వ్యాఖ్యానించారు. అమరావతి రాజధానిలో ప్రభుత్వ కాంప్లెక్సు భవనాలు ప్రత్యేకంగా ఉండాలని ప్రముఖ ఆర్కిటెక్టులతో డిజైన్లు చేయించామని చంద్రబాబు చెప్పారు. అమరావతితో పాటు అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి వికేంద్రీకరించేలా ప్రణాళికలు చేశామని అన్నారు. అమరావతి రాజధానికి రాజమార్గం సీడ్ యాక్సెస్ రోడ్డు అందుబాటులోకి వచ్చేసిందని చెప్పారు. అమరావతి రాజధాని పూర్తి కాలుష్య రహిత నగరంగా మారుతుంది. డీప్‌టెక్ క్యాపిటల్ గా దీనిని తయారు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. ఐదు ముఖ్యమైన అంశాలతో రాజధాని నిర్మాణం చేపడుతున్నామని బాబు గుర్తు చేశారు. నో పోల్స్ బ్లూ గ్రీన్ గ్రీన్ ఎనర్జీ క్వాంటం డీప్ టెక్ లాంటి ఐదు కాన్సెప్టులతో నిర్మాణం జరుగుతోందని అన్నారు. ఏఐ, క్వాంటం కంప్యూటర్ వ్యాలీగా అమరావతి మారుతుంది. టాప్ అయిదు నగరాల్లో ఒకటిగా తయారవుతుందని బాబు విశ్వాసం వ్యక్తం చేశారు.

# సీఎం రేవంత్ రెడ్డి కేసులో బిగ్ ట్విస్ట్

(మొదటి పేజీ తరువాయి)

సుప్రీం తాజా నిర్ణయంతో ఓటుకు నోటు కేసు మరోమారు హాట్ టాపిక్ అవుతోంది. ఈ కేసులో నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య దాఖలు చేసిన పిటిషన్లలో కేసు ప్రమాణికతనే ప్రశ్నించడంతో సుప్రీం కోర్టు నిర్ణయం తీవ్ర చర్చకు దారితీస్తోందని చెబుతున్నారు. కేసులో గతంలో జరిగిన విచారణను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుందని చెబుతున్నారు. గతంలో ఈ కేసును విచారించిన ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి పదవీ విరమణ చేయడం, తదనంతర న్యాయ ప్రక్రియలో సాంకేతికపరమైన అడ్డంకులతో ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. న్యాయ ప్రక్రియలో పారదర్శకతను పాటిస్తూ, ఇప్పటివరకు జరిగిన వాదనలను పక్కనపెట్టి, కేసును మొదటి నుండి కొత్తగా విచారణ చేపట్టాలని సుప్రీం నిర్ణయించడంతో కేసు భవిష్యత్తుపై ఉత్కంఠ రేగుతోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పిటిషన్ లో కేసు విచారణార్హతను ప్రశ్నించడంపై విస్తృత చర్చ జరుగుతోంది. అవినీతి నిరోధక చట్టం – 1988 పరిధిలో ఈ వ్యవహారం వస్తుందా? లేదా? అనేదే ముందుగా తేల్చాలని రేవంత్ రెడ్డి తరఫు న్యాయవాదులు వాదిస్తున్నారు. శాసనమండలి ఎన్నికల్లో ఓటు వేయడం అనేది ప్రభుత్వ ఉద్యోగి విధి నిర్వహణ కిందకు రాదని, కాబట్టి అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు 7, 11 ఈ కేసులో వర్తించవని రేవంత్ రెడ్డి తరఫు న్యాయవాదులు వాదిస్తున్నారు. మరోవైపు, 2018లో జరిగిన చట్ట సవరణలు పాత కేసులకు వర్తించవని, అప్పటి చట్టాల ప్రకారం ఈ కేసు నిలబడదనే వాదనలతో చట్టపరమైన లోపాలను ఎత్తిచూపుతూ కేసును కొట్టివేయాలని కోరుతున్నారు. ఇక న్యాయ ప్రక్రియలో జాప్యం జరగడం వల్ల ఓటుకు నోటు కేసు తెలంగాణ రాజకీయాల్లో మరికొంత కాలం హాట్ టాపిక్ గా కొనసాగనుందని అంటున్నారు. సెప్టెంబర్ 5న జరగనున్న తదుపరి విచారణలో సుప్రీంకోర్టు ఎలాంటి దిశానిర్దేశం చేస్తుందనేది ఆసక్తి రేపుతోందని చెబుతున్నారు, ఈ కేసులోని చట్టపరమైన చిక్కుముడులను కోర్టు ఎలా పరిష్కరిస్తుందనేది కూడా చూడాల్సివుందని అంటున్నారు. ఏది ఏమైనా, ఓటుకు నోటు కేసు మళ్ళీ మొదటికి రావడం, తెలుగు రాజకీయాల్లో పాత గాయాలను మరోసారి కెలికినట్లయింది.

# గోదావరి పుష్కరాలకు వెయ్యి కోట్ల నిధులు..

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేసి, దేశం నలుమూలల నుంచి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. గోదావరి పుష్కరాల సమగ్ర ఏర్పాట్ల కోసం రూ. 1000 కోట్లతో వివిధ శాఖల పరిధిలో పనులు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేబినేట్ సబ్ కమిటీ ఛైర్మన్, మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, గోదావరి పుష్కరాల పనుల పురోగతిని సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. వీలుకాని పక్షంలో వర్చువల్ మీటింగ్ ల ద్వారా పనులను సమీక్షించాలని సూచించారు. గోదావరి పుష్కరాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మక కార్యక్రమంగా భావిస్తున్నందున ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూసుకోవాలని అధికారులకు నిర్దేశించారు.

# ఏపీలో ఉచిత బస్సుకు ఏడాది..!

(మొదటి పేజీ తరువాయి)

కేటగిరీల బస్సులో అమలు చేస్తున్నారు. ఈ పథకం ప్రవేశపెట్టి ఏడాదైన సందర్భంగా సీఎం చంద్రబాబు శనివారం మహిళలతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. "స్త్రీ శక్తికి సంవత్సరం- రెట్టింపైన ఆత్మగౌరవం" పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమం చేపట్టనున్నారు. రాజధాని పరేడ్ గ్రౌండ్ లో స్వాతంత్ర్య దినోత్సవాల అనంతరం "స్త్రీ శక్తికి సంవత్సరం-రెట్టింపైన ఆత్మగౌరవం" కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొంటారు. పరేడ్ గ్రౌండ్ నుంచి సీఎం క్యాంప్ కార్యాలయం వరకు స్త్రీశక్తి లబ్ధిదారులతో కలిసి బస్సులో ఆయన ప్రయాణిస్తారు. క్యాంప్ కార్యాలయంలో మహిళలతో కలిసి హై-టీలో పాల్గొంటారు. ఈ సందర్భంగా వారి ఫీడ్ బ్యాక్ తీసుకోబోతున్నారు.

# కిలో వెండి రూ.100.. ?



ఢిల్లీ, ఆగస్టు 15: దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ సన్నాహాలు జోరుగా సాగుతున్నాయి. 1947లో దేశం బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం పొందింది. అప్పటి నుంచి దేశం గణనీయంగా మారిపోయింది. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో భారత్ అగ్రస్థానంలో ఉంది. అదే సమయంలో అనేక నిత్యావసర వస్తువుల ధరలలో కూడా గణనీయమైన మార్పులు వచ్చాయి. ప్రతీ ఒక్కరిని ఆశ్చర్యపరిచే కొన్ని లెక్కలను ఇప్పుడు తెలుసుకుందాం. నేడు 10 గ్రాముల బంగారం రూ.1.50 లక్షలకు పైగా అమ్ముడవుతు ఒడగా.. ఆ సమయంలో 10 గ్రాముల బంగారం కేవలం రూ.88కే లభించేది. దేశంలో బంగారం కేవలం పెట్టుబడితోనే కాకుండా సంప్రదాయంతో కూడా ముడిపడి ఉంది. బంగారం కొనడం శుభప్రదంగా భావించే పండుగలు చాలా ఉన్నాయి, అదే సమయంలో ఇంట్లో జరిగే పెళ్లి వేడుకల్లో బంగారు ఆభరణాలు కొనే ఆనవాయితీ కూడా ఉంది. అయితే ప్రస్తుతం బంగారంలో పెట్టుబడి పెట్టడం నుంచి 2026 నాటికి బంగారు ఆభరణాలు కొనడం వరకు, ఇది అత్యంత ఖరీదైన వ్యవహారాల్లో ఒకటిగా మారింది. గురువారం దేశీయ మార్కెట్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,52,447గా నమోదైంది, కాగా 1947లో దాని ధర కేవలం రూ. 88.62 మాత్రమే. బంగారం లాగే 1947లో వెండి కూడా చాలా తక్కువ ధరకు అమ్మబడింది. 1947లో కిలో వెండి ధర సుమారు 106 రూపాయలు ఉండగా.. అది 2026 సంవత్సరం మొదటి నెల అయిన జనవరిలో కిలోకు 4 లక్షల రూపాయలు దాటింది. ఈ స్థాయికి చేరిన తర్వాత ధరలో తీవ్ర తగ్గుదల కనిపించినప్పటికీ.. ఈ విలువైన లోహం ఇప్పటికీ చాలా ఖరీదైనదిగా మిగిలిపోయింది. ప్రస్తుతం, దేశీయ మార్కెట్లో 1 కిలో వెండి ధర 2,33,800 రూపాయలు.

# న్యాయవాదుల ఆందోళన

అనంతపురం, ఆగస్టు 14 అనంత సూర్య : నగరంలోని రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట న్యాయవాదులు శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టారు. జూనియర్ న్యాయవాది గౌతం పై సిఐ శ్రీకాంత్ యాదవ్ దాడి చేయడంతో పాటు అసభ్యంగా ప్రవర్తించాదని ఆరోపిస్తూ న్యాయవాదులు స్టేషన్ ఎదుట పెద్ద ఎత్తున బైఠాయించారు. దీంతో కోర్టు రోడ్డు స్తంభించిపోయింది. ఈ సందర్భంగా న్యాయవాదుల బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ జూనియర్ న్యాయవాది గౌతమ్ విధులు ముగించుకొని ఇంటికి వెళుతున్న త-రుణంలో కళ్యాణ దుర్గం రోడ్డులోని నరిగమ్మ దేవాలయం దగ్గర రూరల్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారని అటుగా ద్విచక్ర వాహనంలో వెళుతున్న జూనియర్ న్యాయవాది ని ఆపి బండికి సంబంధించిన పత్రాలను ఇవ్వాలని అడిగారని అందుకు జూనియర్ న్యాయవాది తన పత్రాలను చూపిస్తున్న క్రమంలో తన తండ్రికి ఆరోగ్య సమస్యలు ఉన్నాయని మాత్రలు తీసుకువెళ్లాలని తొందరగా తన రికార్డులను పరిశీలించి పంపాలని తాను జూనియర్ న్యాయవాదినని పోలీసులకు చెప్పినా పోలీసు లు జూనియర్ న్యాయవాది పట్ల దురుసుగా ప్రవర్తించారు. ఎవరైతే మాకేంటి అంటూ పోలీసులు జూనియర్ న్యాయవాది గౌతమ్ అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు స్టేషన్



కు తీసుకెళ్లి సీఐ శ్రీకాంత్ యాదవ్ తో పాటు కానిస్టేబుళ్లుదాడి చేశారని ఆరోపించారు. శ్రీ శ్రీకాంత్ యాదవ్ న్యాయవాది గౌతమ్ కు క్షమాపణ చెప్పడంతో పాటు, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. అయితే పోలీసులు మాత్రం జూనియర్ న్యాయవాదే సీఐ ను చేతికి నోటితో కొరికి గాయపరిచినట్లు పోలీసులు చెబుతున్నారు.

# ఎమ్మెల్యే దగ్గుపాటికి రెడ్ క్రాస్ ప్రశంసా పత్రం

**- 10న దగ్గుపాటి జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం**

**- రక్తదానం చేసిన వారికి అభినందనలతో షీల్డులు అందజేసిన ఎమ్మెల్యే**



అనంతపురం, ఆగస్టు 14 అనంత సూర్య : అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కు రెడ్ క్రాస్ సంస్థ ప్రశంసా పత్రాన్ని అందజేసింది. ఈనెల 10న దగ్గుపాటి పుట్టినరోజు సందర్భంగా క్లస్టర్ ఇన్ ఛార్జి కాయగూరల శ్రీధర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ రక్తదాన శిబిరంలో 50మంది రక్తదానం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి రెడ్ క్రాస్ ప్రతినిధులు లక్ష్మణ్ ప్రసాద్, భరత్ కుమార్ లు వచ్చారు. ఎమ్మెల్యే దగ్గుపాటికి ప్రశంసా పత్రాన్ని అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. మీ పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటైందని.. భవిష్యత్ ఏదైనా పెద్ద కార్యక్రమం జరిగినప్పుడు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని వారు కోరారు. దీనికి ఎమ్మెల్యే దగ్గుపాటి కూడా సానుకూలంగా స్పందించారు. మరోవైపు రక్తదానం చేసిన వారిని అభినందిస్తూ ఎమ్మెల్యే దగ్గుపాటి షీల్డ్ లు అందజేశారు. క్లస్టర్ ఇన్ ఛార్జి కాయగూరల శ్రీధర్ ను ప్రత్యేకంగా అభినందించారు. తన పుట్టిన రోజు సందర్భంగా నాపై ప్రేమతో రక్తదానం చేయడం వ్యక్తిగతంగా తనకు సంతోషాన్నివ్వడమే కాకుండా మీరు 50మంది ప్రాణాలు నిలిపే విధంగా చేశారన్నారు. భవిష్యత్ లో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆకాంక్షించారు.

# వర్షపు నీరు రోడ్లపైకి రాకుండా శాశ్వత చర్యలు తీసుకుంటున్నాం

- నగరంలోని రవి పెట్రోల్ బంక్ వద్ద డ్రైనేజీ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే దగ్గుపాటి

- పనులు నాణ్యత చేయాలని ఆదేశించిన ఎమ్మెల్యే దగ్గుపాటి



అనంతపురం, ఆగస్టు 14 అనంత సూర్య : నగరంలో వర్షపు నీరు రోడ్లపైకి రాకుండా, డ్రైనేజీ వ్యవస్థకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. రవి పెట్రోల్ బంక్ ఎదురుగా లక్ష్మీనగర్ రోడ్డు మార్గంలో చిన్న పాటి వర్షానికే నీరు ముందుకు వెళ్లక రోడ్డుపై చేరిది. ఇది వాహనదారులు, స్థానికులకు తీవ్ర ఇబ్బంది కల్గించేది. ఎమ్మెల్యే దగ్గుపాటి ఇటీవల దీనిపై దృష్టి సారించి ఇక్కడ శాశ్వత పరిష్కారం చూపే దిశగా అడుగులు వేశారు. ఖర్చుకు ఏమాత్రం వెనుకడుగు వేయకుండా భారీ పైప్ లైన్లతో డ్రైనేజీ నీరు ఎంత వచ్చినా సాఫీగా ముందుకు వెళ్లే విధంగా నిర్మాణాలు చేపట్టారు. ఈ పనులను ఎమ్మెల్యే దగ్గుపాటి శుక్రవారం పరిశీలించారు. అక్కడ నిర్మాణ పనుల్లో ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. భవిష్యత్ లో ఎలాంటి ఇబ్బంది లేకుండా పనులు జరగాలని ఆదేశించారు. అలాగే పనులు వేగవంతంగా నాణ్యతగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ గత కొన్నేళ్లుగా ఉన్న సమస్యను ఎవరూ పట్టించుకోలేదన్నారు. ప్రజల ఇబ్బంది దృష్ట్యా ఇక్కడ శాశ్వత పరిష్కారం చేపట్టామన్నారు. ఇప్పటికే నగరంలో చాలా చోట్ల ఇలాంటి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.


# మన జాతీయ పతాకం భారతదేశ ఖ్యాతికి చిహ్నం



అనంతపురం, ఆగస్టు 14 అనంత సూర్య : మన జాతీయ పతాకం భారతదేశ ప్రతిష్ఠకు, ఆత్మగౌరవానికి నిదర్శనమని.. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగురవేయాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. తన నివాసంపై జాతీయ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ టిడిపి నాయకులు పాల్గొన్నారు. అనంతరం జెండాకు అభివాదం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పిలుపుమేరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించే 'హర్ ఘర్ తిరంగా' రాష్ట్రమంతా కనిపిస్తోందన్నారు. ప్రజలంతా ఉత్సాహంతో పాలుపంచుకుంటున్నారన్నారు. మువ్వన్నల జెండా భారతీయులు అందరికీ నిరంతరం నూతన ప్రేరణను అందిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. 2047 లక్ష్యాల సాధనలో ప్రతి పౌరుడినీ భాగస్వామిని చేస్తూ.. వికసిత్ భారత్-స్వర్ణాంధ్ర లక్ష్యాలపై ప్రజల్లో చైతన్యం కల్పించే ఈ విధంగా కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ప్రతీ ఒక్కరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి మన ఉమ్మడి ఐక్యతను చాటాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే స్వాతంత్ర సమరయోధులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ స్టోర్ చైర్మెన్ బోయపాటి శ్రీనివాసులు, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, టిడిపి నాయకులు రాయల్ మధు, దలవాయి వెంకటనారాయణ, జోగి రాజేంద్రలు పాల్గొన్నారు.

# ప్రతి ఊరిలో ప్రతి గల్లీలో జాతీయ జెండా ఎగురవేద్దాం

**- ఎంకేపల్లి సర్పంచ్ మైపాల్ రెడ్డి**



చేవెళ్ల,ఆగస్టు 14, అనంత సూర్య ప్రతినిధి): చేవెళ్ల,నియోజకవర్గ ప్రజలకు ఎంకేపల్లి సర్పంచ్ మైపాల్ రెడ్డి విజ్ఞప్తి చేవెళ్ల నియోజకవర్గంలోని ప్రతి ఊరిలో,ప్రతి పల్లెలో,ప్రతి మండలంలో, ప్రతి జి ఛ్ ఎం సి పరిధిలో,ప్రతి వీధిలో, ప్రతి గల్లీలో ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తూ జాతీయ జెండాను గర్వంగా ఆవిష్కరించాలని ఎంకేపల్లి సర్పంచ్ మహిపాల్ రెడ్డిప్రజలకు విజ్ఞప్తి చేశారు.జాతీయ జెండా కేవలం మూడు రంగుల వస్త్రం కాదని, అది ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ప్రతీక, దేశ గౌరవానికి చిహ్నం,భారతదేశ ఐక్యతకు ప్రతిరూపం అని ఆయన పేర్కొన్నారు.మన దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయులను స్మరించుకుంటూ, ప్రతి ఒక్కరూ దేశభక్తి స్ఫూర్తితో ఆగస్టు 15న జాతీయ జెండాను ఆవిష్కరించాలని కోరారు.ప్రతి ఇంటా జాతీయ జెండా ప్రతి గుండెలో దేశభక్తి ప్రతి అడుగులో దేశ సేవ! అనే స్ఫూర్తితో చేవెళ్ల నియోజకవర్గాన్ని దేశభక్తి చాటేలా నిలబెట్టాలని పిలుపునిచ్చారు.

# ప్రైవేట్ ల్యాబ్స్ లో వైద్యాధికారుల తనిఖీలు

జగ్గయ్యపేట,ఆగస్టు14(అనంత సూర్య ప్రతి నిధి): జగ్గయ్యపేటలోని యశోద ఆసుపత్రి,శ్రీనివాస హాస్పిటల్ తో పాటు పలు ల్యాబ్స్ ను శుక్రవారం జిల్లా వైద్యాధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు.రోగుల నుంచి అధిక మొత్తంలో వైద్య పరీక్షల ఛార్జీలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు ఆసుపత్రిలో పరీక్షల ధరలు,బిల్లులు,రికార్డులను పరిశీలించారు.ఆసుపత్రిలో పరీక్షలకు సంబంధించిన ప్రైస్ లిస్ట్ ప్రదర్శించకపోవడాన్ని అధికారులు పరిశీలించారు.రోగుల నుంచి వసూలు చేస్తున్న పరీక్షల ఛార్జీలకు,బిల్లుల్లో నమోదైన మొత్తాలకు మధ్య వ్యత్యాసాలపై అధికారులు దృష్టి సారించారు.అనంతరం జగ్గయ్యపేటలోని పలు ప్రైవేట్ డయాగ్నస్టిక్ ల్యాబ్‌లపై అధికారులు తనిఖీలు చేపట్టారు.ల్యాబ్‌ల లైసెన్సులు,రెన్యువల్ వివరాలు, అనుమతులు,నిర్వహణ రికార్డులను అధికారులు పరిశీలించారు.లైసెన్స్ గడువు ముగిసిన ల్యాబ్‌లు వెంటనే రెన్యువల్ చేసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు.నిబంధనలకు విరుద్ధంగా ల్యాబ్‌ల నిర్వహణ,రోగుల నుంచి అధిక ఛార్జీల వసూళ్లు ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ప్రైవేట్ ల్యాబ్‌లు, ఆసుపత్రుల్లో ధరల పట్టికను రోగులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించడం తప్పనిసరి అని హెచ్చరించారు.



# భక్తులకు ప్రసాదం పంపిణీ



గురజాల,ఆగస్టు 14,(అనంత సూర్యప్రతి నిధి ): గురజాల పట్టణంలోని వేంచేసి ఉన్నటువంటి శ్రీ పాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయంలో మొదటి శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ చేయటం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రసాదం చేయించిన భక్తులకు అమ్మవారి ఫోటోతోపాటు, కుంకుమను ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు.

# బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టల్లో నాణ్యమైన భోజనం పెట్టాలి




బీసీవై పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ బీసీ సురేష్ యాదవ్

అనంతపురం, ఆగస్టు 14 అనంత సూర్య : బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టల్లో నాణ్యమైన భోజనం పెట్టాలని బీసీవై పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ బీసీ సురేష్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుపతి నగరంలోని ప్రెస్ క్లబ్‌లో బిసివై పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా నూతన కమిటీని బీసీ సురేష్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్ కూకటి విక్రమ్ యాదవ్, జిల్లా కో కన్వీనర్‌గా రోహిత్ రాయల్ ఎంపిక చేశారు. అనంతరం బీసీ సురేష్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని జిల్లాలలోనూ నూతన కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజు దోపిడీని అరికట్టాలని, విద్య హక్కు చట్టాన్ని అమలు చేయాలని, సంక్షేమ హాస్టల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే తిరుపతిలో పర్మిషన్ లేకుండా నడుపుతున్న నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలో విద్యార్థులకు నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలన్నారు. విద్యా రంగ సమస్యలు పరిష్కరించని పక్షంలో బీసీవై పార్టీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని వారు కూటమి ప్రభుత్వానికి హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రాము నాయక్, నిఖిల్, పవన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే దగ్గుపాటి అర్బన్ కార్యాలయంలో 54వ ప్రజా దర్బార్

సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నాం.. అందుకే అర్జీలు తగ్గాయన్న ఎమ్మెల్యే

అనారోగ్యంతో ఉన్న మహిళకు రూ.5లక్షల ఎల్‌ఓసి ద్వారా సాయం

వైసీపీ రంగుల పాలనపై ఎమ్మెల్యే దగ్గుపాటి విమర్శలు

## డిసెంబర్ నాటికి 3 వేల టిడ్కో

# ఇళ్లు ఇస్తాం

*అనంతపురం, ఆగస్టు 14 అనంత సూర్య :*

వచ్చే డిసెంబర్ నాటికి 3వేల టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందజేస్తామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన 54వ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలు వింటూ వారి నుంచి అర్జీల స్వీకరించారు. కొన్ని సమస్యలకు అక్కడిక్కడే పరిష్కారం చూపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కూడా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 54సార్లు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించామని, ఇందులో 1227అర్జీలు వచ్చాయని, వాటిలో 1179 పరిష్కరించామన్నారు. కేవలం 45 మాత్రమే పెండింగ్ లో ఉన్నాయని, సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నా కాబట్టే అర్జీలు తగ్గుతున్నాయన్నారు. అర్జీల్లో ఎక్కువగా హౌసింగ్, పింఛన్ సమస్యలు ఉన్నాయని చెప్పారు. 2014-19 సమయంలో టిడ్కో ఇళ్లు దాదాపు పూర్తి చేశామని, ఆ తర్వాత వచ్చిన గొడ్డలి పార్టీ కేవలం తమ పార్టీ రంగులు వేసుకుని, అసలైన లబ్ధిదారులకు అన్యాయం చేశారని విమర్శలు చేశారు. మేము అధికారంలోకి వచ్చాక టిడ్కో ఇళ్లను పూర్తి చేస్తున్నామని, డిసెంబర్ నాటికి 3వేల ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. జగన్ రెడ్డి 10 లక్షల కోట్ల అప్పులు పెట్టిపోవడంతో వలన రాష్ట్రం ఆర్థికంగా కష్టాల్లో ఉందన్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుభవంతో రాష్ట్రాన్ని గాడిలో పెట్టి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. ఒక్క పింఛన్లకే 35వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. ఈ నెలఖరు లేదా వచ్చే నెల మొదట్లో కొత్త పింఛన్లు కూడామంజూరు చేస్తామని చెప్పారు. మెగా డీఎస్సీపై వైసీపీ నాయకులకు అవసర రాద్ధాంతం చేస్తున్నారని, 150 రోజుల్లో 16,347 పోస్టులను అత్యంత పారదర్శకంగా భర్తీ చేశారన్నారు. టీచర్లను తన హయాంలో అవమానించిన జగన్ రెడ్డి ఈ రోజు డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయంటూ నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆధారాలు చూపించమంటే వైసీపీ నాయకులు ముందుకు రావడం లేదని ఎమ్మెల్యే దగ్గుపాటి విమర్శలు చేశారు.

**అనారోగ్యంతో ఉన్న మహిళకు రూ.5 లక్షల సాయం :**



నగరంలోని 5వ రోడ్డుకు చెందిన నీరజ అనే మహిళ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండగా.. కుటుంబ సభ్యులు ఆమెను హైదరాబాద్ తరలించారు. అక్కడ వైద్యులు ఆపరేషన్ చేయాలని చెప్పారు. విషయాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని, ముఖ్యమంత్రి చంద్రబాబు ద్వారా ఎల్.ఓ.సి మంజూరు చేయించారు. మొత్తం రూ.5 లక్షల రూపాయలు వచ్చేలా చేశారు. ఈ పత్రాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. వారు ఎమ్మెల్యే ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## విద్యార్థి దశ నుంచే దేశ భక్తి

# పెంపొందించుకోవాలి

తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన

రాప్తాడు కస్తూరిబా, మోడల్ పాఠశాలల్లో కార్యక్రమం

మెడల్ స్కూల్లో సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే సునీత చొరవ

తన ఇంటి పై జాతీయ జెండా ఎగురవేసిన ఎమ్మెల్యే సునీత



*అనంతపురం, ఆగస్టు 14 అనంత సూర్య :*

విద్యార్థి దశ నుంచే దేశభక్తితో పాటు క్రమశిక్షణ పెంపొందించుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. తిరంగా యాత్రలో భాగంగా ఆమె రాప్తాడులోని కస్తూరిబా, మోడల్ పాఠశాలలకు వెళ్లారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఆమెకు ఘన స్వాగతం పలకగా వారితో కలిసి త్రివర్ణ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. వందేమాతరం, భారత్ మాతాకీ జై, జై జవాన్ జై కిసాన్ అన్న నినాదాలతో ర్యాలీ సాగింది. అనంతరం మోడల్ పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి సుమారు 200 మొక్కలు నాటారు. అనంతరం పాఠశాలను, విద్యార్థులకు వంట చేయు ప్రదేశాన్ని పరిశీలించారు. ప్రహరీ గోడ అసంపూర్తిగా నిలిచిపోవడం, వంటగది లేకపోవడం, పాఠశాల ఆవరణలో ఫ్లోరింగ్ మరమ్మతులకు గురికావడం, నూతన ప్లాట్ ఫార్మ్ నిర్మాణం, బాత్ రూముల మరమ్మతుల సమస్యల్ని ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా ఈ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు రామగిరి మండలం వెంకటాపురంలోని తన నివాసంపై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుల పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్ని అత్యంత ఘనంగా నిర్వహించడంతో పాటు మన దేశ ప్రజల ఐక్యతను చాటే విధంగా కార్యక్రమాలు చేయాలన్నారు. విద్యార్థులు ప్రధానంగా ఇందులో కీలక భాగస్వామ్యులు కావాలన్నారు. భవిష్యత్ తరాలకు మీరు వారధిగా ఉంటూ ఆ మహానీయులు సాధించిన విజయాలను ప్రతి ఒక్కరికీ చాటి చెప్పాలన్నారు.



* కూటమి ప్రభుత్వంలో బీసీల ఆత్మగౌరవంపై దాడి
* అక్రమ కేసులు, అరెస్టులతో భయపెడుతున్నారు
* ఒక్క వైసీపీ కార్యకర్త కూడా భయపడే ప్రసక్తే లేదు..
* మంచి మాటలు చెప్పినా.. అక్రమ కేసులా !
* కొంత మంది పోలీసులు ప్రైవేట్ సైన్యంలా ప్రవర్తిస్తున్నారు

## రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

# స్వైర విహారం

### మీడియాతో వైసీపీ బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెండ్ రమేష్ గౌడ్



*అనంతపురం, ఆగస్టు 14 అనంత సూర్య :*

ఈ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం స్వైర విహారం చేస్తోంది.. కొంత మంది పోలీసు అధికారులను ప్రైవేట్ సైన్యంగా మార్చుకుని అరాచకాలు సృష్టిస్తున్నారు. ఈ ప్రభుత్వంలో బీసీల ఆత్మగౌరవంపై తీవ్ర దాడి జరుగుతోందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెండ్ రమేష్ గౌడ్ మండిపడ్డారు. శుక్రవారం వైసీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. మీడియాతో ఆయన ఇంకా ఏమన్నారంటే.. అక్రమ కేసులు, అరెస్టుల పేరుతో బీసీలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. రాష్ట్రంలో బీసీల నాయకత్వాన్ని అడుగడుగునా అణచివేయడమే ప్రభుత్వ కుట్ర జరుగుతోంది. వైయస్ జగన్ అండగా ఉన్నారనే అక్కసుతోనే బీసీ నాయకులపై దాడులకు తెగబడుతున్నారు. మహిళా ఎస్సైకి మంచి మాట చెప్పినందుకు వైయస్సార్‌సీపీ నేత చింతాడ రవికుమార్‌పై అక్రమ కేసులు బనాయించారు. చింతాడ రవికుమార్‌ను రౌడీలా, తీవ్రవాదిలా ప్రజల ముందు నడిపించి అవమానించారు. బెయిల్ రాకుండా 21 మందిపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారు. కార్యకర్తను రక్షించేందుకు వెళ్లిన ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి నాయుడిపై దాడి చేశారు. ఎమ్మెల్యే సోదరుడు శ్రీరాములు చేయి విరగ్గొట్టి తిరిగి బాధితులపైనే కేసులు పెట్టారు. అర్ధరాత్రి దొంగల్లా తలుపులు బద్దలుకొట్టి ఎమ్మెల్యే, ఆయన కుమారుడిని అక్రమంగా అరెస్ట్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం మహిళల ఆత్మగౌరవాన్ని సైతం కించపరుస్తూ కుట్రలు పన్నుతున్నారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, బీసీ సెల్ నేత వాసు యాదవ్‌పై కల్పిత కథలతో కేసులు పెట్టారు. పెట్టిన కేసుల్లో ఒక్క ఆధారమైనా, వీడియో విజువల్స్ అయినా ఉన్నాయా ? అని ప్రశ్నించారు. వైయస్ జగన్ ఇంటి నుంచి బయటకు వస్తేనే పాలకులకు వణుకు పుడుతోందన్నారు. దారులు మూసేసి చెక్‌పోస్టులు పెట్టినా జగన్‌పై ఉన్న ప్రజాభిమానాన్ని ఆపలేరన్నారు. గత 40 ఏళ్లుగా ఎన్నికలప్పుడు బీసీల పార్టీ అంటూ అధికారంలోకి రాగానే వెన్నుపోటు పొడుస్తున్నారని, ఆదరణ పథకం పేరుతో బీసీలను ఎప్పటికీ కూలీలుగానే ఉంచాలని చూశారని ఆవేదన వ్యక్తపరిచారు. విజన్ 2020, విజన్ 2047 అని చెప్పడం తప్ప బీసీల బతుకుల్లో తెచ్చిన మార్పు ఏంటి ? అని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా విప్లవం తెచ్చి బీసీ బిడ్డలను గ్లోబల్ స్థాయిలో నిలబెట్టింది జగన్ మోహన్ రెడ్డి మాత్రమే అన్నారు. విప్లవాత్మక మార్పులతో పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించింది గత ప్రభుత్వమే. సచివాలయ వ్యవస్థ ద్వారా పరిపాలనను పేదల గుమ్మం వద్దకే తీసుకొచ్చిన ఘనత వైయస్ జగన్‌దన్నారు. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు బీసీల ఎదుగుదలను చూసి ఓర్వలేకపోతున్నారు. అక్రమ కేసులకు, వేధింపులకు వైయస్సార్‌సీపీ బీసీ నాయకులు ఎవరూ భయపడే ప్రసక్తే లేదన్నారు. చట్టం అధికార పార్టీకి చుట్టం కాదు.. పోలీసులు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలన్నారు. అణచివేత ఎక్కువైతే ప్రజల నుంచి వచ్చే తిరుగుబాటు అంతే తీవ్రంగా ఉంటుంది. అన్యాయానికి గురవుతున్న ప్రతి బీసీ కార్యకర్తకు వైయస్సార్‌సీపీ కొండంత అండగా నిలుస్తుంది. రెట్టింపు ఉత్సాహంతో పోరాడి భవిష్యత్తులో మళ్లీ వైయస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. పాలకుల స్వార్థ రాజకీయాలకు, జగన్మోహన్ రెడ్డి సంక్షేమ ఆలోచనకు ఉన్న తేడాను ప్రజలు గమనించాలని ఈ సందర్భంగా బీసీ రమేష్ గౌడ్ అన్నారు.

# కరువు పరిస్థితులు దారుణం

- జిల్లాలో ఏ పంటా చేతికొచ్చే పరిస్థితి లేదు
- ఇప్పటికే అడుగంటిన భూగర్భజలాలు
- తీవ్రంకానున్న పశుగ్రాసం కొరత
-పశుగ్రాసం కోసం కలెక్టరేట్‌కో..ప్రభుత్వ కార్యాలయాల వద్దకో పశువులను తోలాలా?
- 4 లక్షల ఎకరాల్లో విత్తనం వేయలేని పరిస్థితులు
- కూటమి పాలనలో అస్తవ్యస్తంగా పంటల బీమా




అనంతపురం, ఆగస్టు 14 అనంత సూర్య : నంతపురం జిల్లాకు కరువు కొత్త కాకపోయినా ఈసారి మాత్రం దారుణ పరిస్థితులు ఉన్నాయని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఓ వైపు సాగు చేసిన పంటలు చేతికొచ్చే పరిస్థితులు లేవని.. మరోవైపు పశువులకు పశుగ్రాసం కొరత తీవ్రం కానుందని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జూన్‌లో వర్షాలు కురవలేదని, జూలైలో 70 శాతం లోటు వర్షపాతం నమోదైందన్నారు. ఆగస్టులో ఇప్పటి వరకు వర్షాలు లేవని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా భూగర్భజలాలు అడుగంటిపోయాయని, చాలా ప్రాంతాల్లో 40 మీటర్లకు పడిపోయినట్లు చెప్పారు. తాగునీటితో పాటు పశువులకు నీరు, గ్రాసం లభించడం లేదని.. ప్రభుత్వం మాత్రం కేవలం ప్రకటనలకే పరిమితం అవుతోందన్నారు. సాధారణంగా జిల్లాలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం 8.48 లక్షల ఎకరాలుంటే 4 లక్షల ఎకరాలకు పైబడి విత్తనం వేయలేదని తెలిపారు. వేరుశనగ, కంది, ఆముదం, పత్తి పంటలు వేసినా అవి చేతికొచ్చే పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదని తెలిపారు. ఇప్పటికే పంట సాగు సన్నద్ధం కోసం పంట రకాన్ని బట్టి ఎకరాకు రూ.3 వేల నుంచి రూ.6 వేల వరకు రైతులు ఖర్చు చేశారని గుర్తు చేశారు. ఈ ఖరీఫ్‌లో రెండున్నర నెలలు గడిచిపోయాయని, వేసిన పంటలు ఎండిపోతున్నట్లు తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఉచిత పంటల బీమా అమల్లో ఉండేదని, ఈ ప్రభుత్వం మాత్రం రైతుల నుంచి ప్రీమియం కట్టించుకుంటోందని తెలిపారు. వాతావరణ బీమా ప్రీమియం చెల్లింపునకు గడువు ముగిసిపోగా ఫసల్ బీమా ప్రీమియం చెల్లింపు గడువు ఆగస్టు 15వ తేదీతో ముగుస్తోందన్నారు. ఇప్పటికే జిల్లా రైతాంగం 8.20 లక్షల ఎకరాలకు బీమా చేయించారని, కానీ పంట సాగులోకి వచ్చింది మాత్రం 4.10 లక్షల ఎకరాలకు మాత్రమేనని తెలిపారు. ప్రస్తుతం వేరుశనగ, కంది, ఆముదం, పత్తి పంటలు వేసుకునే పరిస్థితి లేదని సాక్షాత్తూ వ్యవసాయ శాఖ అధికారులే చెబుతున్నారని తెలిపారు. మరోవైపు జిల్లాలో 40 లక్షల వరకు పశుసంపద ఉందని, ఇందులో ఎద్దులు 2 లక్షలు, గేదెలు 1.80 లక్షలు, గొర్రెలు 30 లక్షల వరకు ఉన్నాయని తెలిపారు. ఒక్కో పశువుకు రోజుకు 30 కిలోల వరకు గ్రాసం అవసరం అవుతుందని, కానీ క్షేత్రస్థాయిలో పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం మాత్రం కనీసం ఒక్క సమీక్ష చేసిన పాపాన పోలేదని అన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ ఆర్‌అండ్‌బీలో, సత్యకుమార్ యాదవ్ ధర్మవరంలో.. సవితమ్మ పెనుకొండలో నామమాత్రపు సమావేశాలు పెట్టుకుంటున్నారని చురకలంటించారు. తమ నియోజకవర్గాల్లోని పరిస్థితులను ఎమ్మెల్యేలు కూడా పట్టించుకోవడం లేదని అన్నారు. జిల్లా రైతాంగానికి ఆత్మస్థైర్యం ఇచ్చేలా వ్యవసాయ, అనుబంధ శాఖలపై కనీసం సమీక్ష చేసే తీరిక మీకు లేదా? అని ప్రశ్నించారు. ఇప్పటికే రైతుల ఆత్మహత్యలు, వలసలు పెరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో బిల్డింగులు, రోడ్డు పనులు పేరుతో ప్రచారం చేసుకోవడం తప్పితే కరువుపై దృష్టిపెట్టలేరా? అని అన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులకు తమ రాజకీయాలు, వ్యక్తిగత ఆదాయ మార్గాలకే పదవులు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ప్రతి శని, ఆదివారాల్లో పెద్ద ఎత్తున మార్కెట్ యార్డులకు పశుసంపద తరలిపోతోందని, అయినా ప్రజాప్రతినిధులకు చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. 2024 ఖరీఫ్, రబీతో పాటు 2025 ఖరీఫ్‌కు సంబంధించి బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ రాలేదన్నారు. 2024 ఖరీఫ్ బీమా విడుదలైందని చెబుతున్నా రాష్ట్రం తన వాటాను చెల్లించలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో పంటల బీమాను అస్తవ్యస్తంగా మార్చేశారని మండిపడ్డారు. 2023 ఏడాది చివరి నుంచి ఇప్పటి వరకు 200 మంది వరకు రైతులు ఆత్మహత్య చేసుకుంటే పరిహారం మాత్రం ఆ కుటుంబాలకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భజలాలు పడిపోతున్న నేపథ్యంలో మోటార్ల కెపాసిటీ పెంచుకోవాలంటే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వడం లేదని తెలిపారు. జిల్లాలో 3700 నుంచి 4000 ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం ఉన్నా పట్టించుకునే నాథులు లేరన్నారు. ఎమ్మెల్యేలు చెబితేనో.. ముడుపులు ఇచ్చుకుంటేనో ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చే పరిస్థితి నెలకొందని తెలిపారు. హెచ్ఎల్‌సీ, హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి నీటి రాక ప్రారంభం అయ్యిందని, మొదటి ప్రాధాన్యతగా తాగునీటి అవసరాల కోసం అని అధికారులు చెబుతున్నారని తెలిపారు. ఇలాంటి నేపథ్యంలో పంటల సాగుకు నీళ్లు ఇవ్వలేం.. కనీసం పరిహారం అందేలా చేస్తాం అని ఎందుకు ధైర్యంగా చెప్పలేకపోతున్నారని ప్రశ్నించారు. ప్రస్తుతం వేరుశనగ సాగు చేసిన దాని కన్నా ఎక్కువగా బీమా ప్రీమియం చెల్లించారని, అలాంటి రైతులకు ఎలా న్యాయం చేస్తారని అన్నారు. కంది, పత్తికి ప్రీమియం చెల్లించినా ఆ పంటలు కూడా వేసుకోలేదని తెలిపారు. అసలు విత్తనం వేయడానికే పరిస్థితులు అనుకూలించలేదని, ఇలాంటి నేపథ్యంలో వేఁమున్నాం అంటూ రైతులకు ధైర్యం చెప్పేవారు ఒక్కరూ లేకపోవడం బాధాకరమని అన్నారు. ప్రత్యేకంగా పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, లేకపోతే పశువులను కలెక్టరేట్‌కో.. ప్రభుత్వ కార్యాలయాల వద్దకో తోలే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణం 2024, 2025 సీజన్లకు సంబంధించి బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి ట్రాన్స్‌ఫార్మర్లు అందించాలని, ఈ విషయంలో మంత్రి రవికుమార్ ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405